**71**

**ధారావాహిక**



# జాయ సేనాపతి

**చారిత్రక కాల్పనిక నవల**

మత్తి భానుమూర్తి
99893 71284

**జరిగిన కథ : ఒకనాడు.. గజశిక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టమని జాయపుడికి సూచించాడు చక్రవర్తి గణపతి దేవుడు. 'తప్పకుండా బావగారూ..' అంటూ, ఆ పనిపై పడ్డాడు జాయపుడు. అనుమకొండ చుట్టూ ఉన్న పాతిక గజ స్థావరాలన్నిటినీ సందర్శించాడు. అక్కడ ఏనుగులకు ఇస్తున్న యుద్ధశిక్షణ చూశాడు. ఇప్పటికే అతని శిక్షణలో ధీర.. 'కాహళి' కూజితం వినగానే పాతికమంది నైనా చంపేసేలా రూపుదిద్దుకున్నది.**

ఇప్పుడు ఒక్క ఏనుగుకు కాదు.. ఏనుగుల మంద.. పది నుంచీ యాభైవరకు ఉన్న మందకు శిక్షణ ఇవ్వడం ప్రారంభించాడు జాయపసేనాని. ఒక దళంలో ఉన్న ఏనుగుల మంద మొత్తం.. తన కూజితాల ప్రకారం యుద్ధక్షేత్రంలో ఎలా ప్రవర్తించాలో.. తదనుగుణమైన ఆజ్ఞలను నేర్పుతున్నాడు.

ఎంతదూరాన ఏనుగుల మంద ఉన్నా.. జాయపుని బూరశబ్దం వినిపిస్తే చాలు.. తదనుగుణంగా ప్రవర్తిస్తాయి.

శత్రువును తొక్కితొక్కి చంపేస్తాయి. తొండంతో ఎత్తి అవతలకు విసిరేస్తాయి. 'మిత్రుడు' అనే సంకేత కూజితం వినిపిస్తే చాలు.. కాపాడి ఈగ వాలకుండా స్కంధావారం చేరుస్తాయి.

సాధారణంగా ఏనుగు సాధుజంతువు. కానీ, మందగా ఏనుగులు అత్యంత క్రూరమైనవి. ఊహాతీతమైన విలయాన్ని, విధ్వంసాన్ని సృష్టించగలవు. వంద నివర్తనాల పంటభూమిని లిప్తలకాలంలో పాడు చేయగలవు. వందలమంది మహాయోధులను కూడా చుట్టుముట్టి.. వారి రథాలు, ఆయుధాలను లెక్కజేయక తొక్కి తొక్కి చంపగలవు. కావాల్సింది సరైన ఆజ్ఞ.. మార్గదర్శనం!

జాయపసేనాని శిక్షణలో కాకతీయ ఏనుగుమందలు సృష్టించబోయే విధ్వంసకాండను చూడాలంటే మరో యుద్ధం ఏదో రావాల్సిందే!!

జాయప గజశిక్షణాశాలకు వచ్చిన సంగతి చక్రవర్తికి తెలియజేశాడు గజసాహిణి కొమరయ. తన మాటను గౌరవించి గజశాలకు వెళ్లిన జాయపపై గణపతికి అభిమానం పొంగగా.. తంత్రిపాలుడు ముచ్చనాయకుడు, రుద్ర సేనాని..

'హమ్మయ్య.. గజశిక్షణ ఇక ఓ గాడిన పడుతుందిలే!' అని నిట్టూర్చారు.

తర్వాత జాయపుడు పట్టణ భవన నిర్వహణ నియోగ అధికారి కొండపెద్దిని కలిశాడు.

''రాజనగరి లోపల ఉండటం.. చెప్పకూడదు గానీ, నాకూ చక్రవర్తులవారికి కూడా కొంత ఇబ్బందిగా ఉన్నది పెద్దిగారు. దయచేసి నాకు రాజనగరి బయట.. ఏదైనా భవంతి వసతిగా ఏర్పాటుచేయండి. వీలయితే అంగళ్ల చతుష్పథం వద్ద అయితే గజశిక్షణశాలలకు వెళ్లడానికి వసతిగా ఉంటుంది. చిత్తగించగలరు''.

''అదెంత భాగ్యం సేనాని జాయపా! తప్పకుండా..'' అన్నాడు కొండపెద్ది.

అంగళ్ల చతుష్పథం వద్ద మంచి మిద్దె ఉన్న భవంతిని జాయపుడికి కేటాయించాడు కొండపెద్ది. మరునాడు కొండపెద్దిని కలిసి హత్తుకున్నాడు. ''మీకు నా కృతజ్ఞతలు ఎలా చెప్పాలో తెలియడంలేదు. చాలా చాలా పెద్ద ఇబ్బంది తొలగించారు. మరో చిన్న విషయం. ఈ సంగతి.. అదే.. నాకు బయట భవంతిని కేటాయించినట్లు చక్రవర్తిగారికి తెలియకూడదు సుమా! అది మీ బాధ్యత..'' అన్నాడు.

ఇది రహస్యంగా ఎందుకు ఉంచాలో.. ఎలా ఉంచాలో తెలియక లోలోన కుళ్లిపోయాడు కొండపెద్ది.

జాయపుని మిత్రబృందం ఇకపై అంగళ్లవీధిలో రాతి బండపై కూర్చోకుండా.. అదే అంగళ్లవీధిలోని రాజభవంతిలో కూర్చుంటారన్నమాట!